# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్

ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 14 డిసెంబరు , 2024 | పేజీలు :05


## కస్తూర్బా గాంధీ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ రామగిరి :** రామగిరి మండలం లోని పన్నూరు గ్రామంలో గలకస్తుర్బా గాంధీ పాఠశాలను పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ డి. వేణు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందించే బోజనాలు మరియు బోజన మెనూ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గదిలో ఉన్న సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమములో డీఎస్ఓ రాజేందర్ ,తహశీల్దార్ బోర్కర్ రాంచందర్ రావు, ఎంపీడీవో బద్రి శైలజ రాణి, ఎంఈఓ కొమురయ్య,ఎంపీ ఓ దేవర కొండ ఉమేష్, మరియు పాటశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ విద్యే లక్ష్యంగా ఐఐఐటిని తీర్చిదిద్దుతాం..

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** ఉత్తమ విద్యే లక్ష్యంగా బాసర ఐఐఐటిని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్.మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం నిర్మల్ జిల్లా పర్యటనలో భాగంగా ఆర్జీయూకేటీ బాసరను మంత్రి సందర్శించారు.క్యాంపస్ కు చేరుకున్న మంత్రి కి జిల్లా కలెక్టర్,ఎస్పీ,వైస్ ఛాన్స్లర్,విద్యార్థులు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు.అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.తదనంతరం సమావేశ మందిరంలో అధికారులతో కలిసి మంత్రి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్,వీసీ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు,భోజన శాల,వసతి గృహాల నిర్వహణ విద్యార్థులకు అందిస్తున్న వసతులు,సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను మంత్రికి వివరించారు.విద్యార్థుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.నాణ్యమైన భోజనం అందించాలని,ఫ్యాకల్టీ సరిపడా లేక సిలబస్ పూర్తి కావడం లేదన్నారు.స్టూడెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని,అమ్మాయిల కోసం గైనకాలజిస్ట్ ను ప్రత్యేకంగా ఇక్కడే ఉంచాలని కోరారు.స్కాలర్ షిప్స్ లేక సర్టిఫికెట్స్ తీసుకోలేక పోతున్నామని తెలిపారు.బెడ్స్,జనరల్ స్టోర్,కౌన్సిలర్లు,స్టేడియం,మెస్ కాంట్రాక్టర్ ను మార్చాలని,మెస్ ల సంఖ్యను పెంచాలని కోరారు.ఇంజనీర్ విద్యార్థులకు లాప్టాప్ లు,ఇంటర్నెట్ సదుపాయం వైఫై,లైబ్రరీ లో వివిధ కంపిటేషన్ పుస్తకాలు,క్రీడలకు సంబంధించి పీడి లను ఏర్పాటు చేయాలని విద్యార్థులు మంత్రిని కోరారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ,ఉత్తమ విద్యే లక్ష్యంగా ఐఐఐటీ తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.వివిధ అభివృద్ధి పనులకు తక్షణం 1 కోటి రూపాయలను మంజూరు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు.విద్యార్థులందరిని కలవడం ఆనందంగా ఉందని,బాసర సరస్వతి దేవీ ప్రాముఖ్యతను గుర్తించి అప్పటి ప్రభుత్వం 2008లో ఐఐఐటి ప్రారంభించిందని తెలిపారు.ఆర్జీయూకేటీ బాసరను ఉత్తమ విద్యా సంస్థగా ఎదిగేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పనిచేస్తుందని,ప్రీ ప్రైమరీ నుండి ఉన్నత విద్య వరకు ప్రతిష్టాత్మకమైన పాలసీ తీసుకురాబోతున్నట్లు చెప్పారు.క్యాంపస్ లో దాదాపు 9వేల మంది విద్యార్థులు చదువుతున్నారని,నాణ్యమైన విద్యానందించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభావంతులైన విద్యార్థులు ఐఐఐటి లో ప్రవేశాలు పొందుతారని,విద్యతోపాటు మెరుగైన వసతి,సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ప్రతిరోజు మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని ఆదేశించారు.బాసర ఐఐఐటి పూర్వ విద్యార్థులు దేశంలో వివిధ రంగాలలో రానిస్తున్నారని,విద్యార్థులందరూ కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు.అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి జిల్లా కలెక్టర్,ఎస్పీ,అధికారులు,ప్రజాప్రతినిధులు భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు రామారావు పటేల్,ఎంఎల్ సి లు బాలూరి వెంకట్,దండే విట్టల్,ఆర్డీఓ లు రత్న కళ్యాణి,కోమల్ రెడ్డి,తహసీల్దార్ పవన్ చంద్ర,ఎంపీడివో అశోక్,అధికారులు,ప్రజాప్రతినిధులు,అధ్యాపకులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** గ్రూప్ 2 పరీక్ష కొరకు జిల్లాలో ఏర్పాటుచేసిన 18 పరీక్ష కేంద్రాలలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పి శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పరీక్షల నోడల్ అధికారి దీపక్ తివారి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 15, 16 తేదీలలో జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రం ప్రాంగణం, ముఖ్య పర్యవేక్షకులు గదిలో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని, అవసరమైన ఫర్నిచర్, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈనెల 15, 16 తేదీలలో ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం 2 పేపర్లు ఉంటాయని, పరీక్ష కేంద్రంలో అనుమతిలేని సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, షూలు గేటు బయట తీసుకొని పరీక్షా సమయం పూర్తయ్యే వరకు భద్రపరచాలని, అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఉదయం పరీక్షకు 9:30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు రెండున్నర గంటలకు గేట్లు మూసి వేయడం జరుగుతుందని, తదుపరి ఎవరిని అనుమతించవద్దని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పిటిజి గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న గ్రూప్ టూ పరీక్షల కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్, జిల్లా అధ్యక్షుడు మసురాలి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దీక్షా శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కళ్లకు నల్ల గంతలు కట్టుకుని వినూత్న నిరసన తెలియజేశారు. అందుకు టిఆర్‌పిఎఫ్ సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేసి మాట్లాడారు. సమగ్ర శిక్ష శిక్ష ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు అయిన మినిమం టైమ్ స్కేల్, జీవిత బీమా, హెల్త్ కార్డులు, సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులకు 108 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, మరణించిన ఉద్యోగ కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ప్రభుత్వం వెంటనే ప్రకటించి వారి జీవితాలతో ఆనందాలు, వెలుగులు నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనంతో అత్యంత దుర్భర పరిస్థితులలో జీవనం గడుపుతున్నారని, వారికి కనీస వేతనాలు ప్రకటించి అందిస్తే వారు ఆనందంగా వారి వృత్తి నిర్వహణలో ప్రభుత్వానికి ఇటు ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ కార్యనిర్వహణలో అంకితభావంతో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అద్యక్షుడు గుండా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, రవిచంద్ర, బి.శ్రీకాంత్, కేజీబివి ప్రత్యేక అధికారులు, ఎం.అజిత, బి.రమాదేవి, ఎన్.పూర్ణిమ, గౌతమి, పి.మాధవి, పి.కిరణ్ జ్యోతి, ఎం.స్వప్న, ఎ.సునీత, పి.కవిత, వై.భార్గవి, ఇ.లావణ్య, కె.సుప్రియ, కె.రజిత, జి.పుష్కరాణి, కె.మధులత, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, నీరజ, రవిచందర్, ఆంజనేయులు, వెంకటేష్, శ్రీకన్య, బి.రమేష్, మీనాక్షి, తిరుమల, శ్రీనివాస్, భరత్, శ్రీనివాస్, ప్రభాకర్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు అమలులో ప్రభుత్వం విఫలం

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/బోధన్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడుస్తున్నా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ఆరు పథకాల గ్యారెంటీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు విమర్శించారు. రాష్ట్ర బిజెపి పిలుపు మేరకు శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రచారంతో ఎన్నికలలో గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడిచిన రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. కళ్యాణ లక్ష్మీ , షాది ముబారక్ పథకం ద్వారా లక్ష రూపాయల తులం బంగారం ఇస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంవత్సర కాలమైన ఈ పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలకు 2500రూపాయల పెన్షన్ వికలాంగులకు 6వేల పెన్షన్, ఆటో రిక్షా వాళ్లకు ఏడాదికి 12వేలు ఇస్తానన్న సిఎం పబ్బం గడుపుతూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో భార్య,భర్తలు ఇద్దరూ ప్రయాణం చేస్తే భార్య కూర్చుని భర్త నిలబడి ప్రయాణం చేసే పరిస్థితులు నెలకొంటున్నాయని, ఈ పరిస్థితి వల్ల మగవారికి అవమానాలు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. బోధన్ పట్టణంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికలప్పుడు హామీ ఇచ్చి ఆ హామీని విస్మరించారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలపై తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర అభివృద్ధికై కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, అట్లూరి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, బిజెపి నాయకులు నరసింహారెడ్డి, రామరాజు, సంతోష్, మనోహర్, సుధాకర్, వినోద్, హరి, అశోక్ పాల్గొన్నారు.



## రాణా కలాన్‌లో చోరీ... వెండి అపహరణ

**ప్రజాపక్షం/ఎడపల్లి :** తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు ధ్వంసం చేసి వెండితో పాటు పట్టు చీరలను దోచుకెళ్లిన సంఘటన ఎడపల్లి మండలంలోని రాణాకలాన్‌లో చోటుచేసుకుంది. ఘటన స్థలాన్ని ఎడపల్లి పోలీస్ సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామంలో మోపాల్ కృష్ణ అనే వ్యక్తి ఇంటి తాళాలు పగల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వృత్తి రీత్యా నిజామాబాద్ పట్టణంలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో తమ ఇంటికి తాళం వేసి వెళ్లారు. తాళం వేసి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న బీరువాలను ధ్వంసం చేసి దొంగలు ఇంట్లో ఉన్న విలువైన వెండితో పాటు పట్టు చీరలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బీడీ కార్మికులకు జీవనభృతి పెంచాలి

**ప్రజాపక్షం / నందిపేట్ :** బీడీ కార్మికులందరికి జీవన భృతి పెంచుతూ వర్తింపచేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం కటాఫ్ తేదీ పెట్టి కొందరికే జీవన భృతి మంజూరు చేసిందని వారం టున్నారు. తరువాత పిఎఫ్ నెంబరు వచ్చిన వారికి ఇంత వరకు కొత్త పెన్షన్ మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదు. ఎన్నికల సమయంలో అందరు బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తామని, పెన్షన్ నాలుగు వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు కొత్తవి మంజూరు చేయలేదు, పెన్షన్ పెంచలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని కార్మికులు కోరుతున్నా రు. మరోవైపు బీడీ కార్మిక సంఘాలు పోరా టం చేస్తున్నాయి.

## కెజిబీవీ వర్కర్ల వేతనాలు పెంచాలి

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు రూ.26 వేలు పెంచాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల కెజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకురాలు శోభ, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఈ.నరేష్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని కెజీబీవీ విద్యాలయం ఎదుట వేతనాలు పెంచాలని కోరుతూ వర్కర్లు నిరసన చేపట్టారు. సంవత్సరాల తరబడిగా పనిచేస్తున్న వర్కర్లకు గుర్తింపు, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్ సదుపాయాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవన్నారు. ఔట్ సోర్సింగ్ విధానంతో విద్యాలయాల్లో వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. ఇఫ్టూ నాయకులు ఎర్ర రవికుమార్, అసోసియేషన్ మండల నాయకురాలు లలిత, జయశ్రీ, శ్రీజా, మధునమ్మ, సరోజన, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

## సింగరేణి విశ్రాంత కుటుంబీకులకు 'రెనోవా' వైద్య శిబిరం




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** శుక్రవారం రోజున మేడ్చల్ జిల్లా, కొరెముల సుప్రభాత్ టౌన్ షిప్‌లో రెనోవా బంజారాహిల్స్ హైదరాబాద్ హాస్పిటల్ వారు వంద మంది సింగరేణి విశ్రాంత కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు ఇచ్చారు. ఈ వైద్య శిబిరంను తెలంగాణా ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సుప్రభాత్ టౌన్‌షిప్ యూనిట్ అధ్యక్షులు బంగారి రాజయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఇంతియాజ్ జనరల్ ఫిజిషియన్, డాక్టర్ జవహర్ కార్డియాలజిస్ట్, డాక్టర్ హిమాకాంత్ ఆర్థో సర్జన్, డాక్టర్ శైలజ, స్త్రీ వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆకవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ నేటి కాలంలో కలుషిత ఆహారం, కలుషిత వాతావరణం వలన ఆరోగ్యం పట్ల తగు శ్రద్ధ వహిస్తూ జీవన యానం కొనసాగించాలని, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరిక మేరకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం చాలా మంచి పరిణామం అని తెలిపారు. ఈ వైద్య శిబిరం లో రెనోవా హాస్పిటల్ వారి కార్పొరేట్ సర్వీసెస్ సీనియర్ మేనేజర్ డి.ఎస్ కృష్ణకుమార్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆకవందార్ వేణు మాధవ్,సలహాదారులు టి.ఉమాకర్,వైస్ ప్రెసిడెంట్ బి.రాజయ్య,కె బీరయ్య, ఎం.రాజా నర్సు,లక్ష్మీ నారాయణ, చుక్కల నర్సయ్య,కొట్టె మల్లయ్య,ఎ. ప్రభాకర్, ప్రతాప్ సింగ్,బి.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

ఎంపిడివొ శైలజ రాణి



**ప్రజా పక్షం/రామగిరి :** క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ముందుకెళ్లాలని ఎంపిడివొ శైలజ రాణి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రామగిరి మండలంలోని పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలో గల మంథని జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎం కప్ పోటీలు నిర్వహించగా శుక్రవారం ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో విజేతల నిలిచిన వారు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఎంపిడివొ శైలజ రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎన్టీయూ ప్రిన్సిపల్ చెరుకు శ్రీధర్ రెడ్డి, ఎంఈఓ కొమురయ్య, ఎంపీఓ దేవర కొండ ఉమేష్, ఎఎస్ఐ వినోద్ కుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పింగిలి,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** జిల్లా కేంద్రంలోని మానిక్‌భవన్ పాఠశాలలో విద్యార్థినిలకు శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో సైకిళ్లను అందజేశారు. మానిక్‌భవన్, గుండారం, శంకర్ భవన్ ప్రభుత్వ పాఠశాలలతో ఆర్చిడ్, సెయింట్ జేవియర్ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లని అందజేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు ఎం.భూంరెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ యుగంలో పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. కష్టపడి పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ శ్రీనివాస్, గౌరీ శంకర్, ఉపాధ్యాయులు బి.వీరబ్రహ్మం, సభ్యులు గిరీష్‌కుమార్, కోటగిరి చంద్రశేఖర్, గంజి రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలోని గాండ్లపేట్ గ్రామంలో గల పెద్దవాగు నుంచి శుక్రవారం ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా సక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను మోర్తాడ్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్ పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లగా మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణ మూడు ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే మోర్తాడ్ మండల పరిధిలోని ఏ గ్రామంలో నుండైనా ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసిన, అక్రమంగా మొరం రవాణా చేసిన ఎంతటి వారైనా సరే వదిలేది లేదని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

## సినీ హీరో మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/బోధన్ :** ఫిలిం ఇండస్ట్రీ సినీ హీరో మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బోధన్ జర్నలిస్టులు శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతూ కార్యాలయ అధికారికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సాయిలు, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ.. మీడియా కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్టులపై సినీ హీరో మోహన్‌బాబు దురుసుగా ప్రవర్తించి టీవీ 9 రిపోర్టర్‌పై, మీడియాపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మోహన్‌బాబు వెంటనే మీడియాకు క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ జర్నలిస్టులు శ్రీనివాస్, సూర్య ప్రకాష్, శ్రీనివాస్, అశోక్, ఉమాకాంత్,రాజేష్, జగన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే షురూ

**ప్రజాపక్షం/ముత్తారం :** ఇల్లు లేని నిరుపేదలు ఎంతగానో ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముత్తారం మండల కేంద్రంలో ప్రారంభమైంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఎంపీడీవో సురేష్, ఎంపివొ గోవర్ధన్, గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సురేష్ ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి కోసం చేసుకొన్న దరఖాస్తుల ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఎంపిడిఒతో పాటు తదితర శాఖల అధికారులుఒకరు చొప్పున వార్డు అధికారులకు ప్రత్యేకంగా యూజర్ నేమ్, పాస్వర్డ్ లు కేటాయించారు. ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇండ్లు మొబైల్ యాప్లో వచ్చే వివరాల ఆధారంగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫోటోలు, వివరాలు అప్లోడ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఎంపీఓ గోవర్ధన్, తోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహ సర్వే కమిటీతో సమావేశం

**ప్రజాపక్షం/ముత్తారం :** ఇందిరమ్మ గృహ నిర్మాణ సర్వే కమిటీతో సమావేశం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడిఒ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఎంపిక చేసేందుకు కమిటీ ఏర్పాటు చేశారు. ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసేందుకు కమిటీ సభ్యులు సహకరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎంపీ ఓ గోవర్ధన్ తోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఎంపిడివొ లలిత

**ప్రజాపక్షం/ రామగిరి :** కమాన్ పూర్ మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సహకరించాలి అని ఎంపీడీవో జీ లలిత అన్నారు. శుక్రవారం మండలంలో ఇందిరమ్మ గృహాల సర్వే ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ నుండి సర్వేయర్లు ఇండ్ల సర్వే కి వచ్చినప్పుడు గ్రామ ప్రజలు వారి యొక్క భూమి యొక్క పత్రాలు మరియు ఇతర ధ్రువీకరణ పత్రాలను వారికి ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాటం భాస్కర్ పంచాయతీ కార్యదర్శులు రాజ్ కుమార్, రామ్మోహన్, జంజర్ల అమల, ఆమీన భాను తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో లేని ఎరువు బస్తాలు

ప్రజాపక్షం/చందుర్తి : మండల కేంద్రంలోని ఫ్యాక్స్ లో రైతులకు ఎరువు బస్తాలు అందుబాటులో లేవని కాంగ్రెస్ నాయకులు పులి సత్తయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఫ్యాక్స్ పాలకవర్గ సభ్యులు ఫర్టిలైజర్ షాపుల యజమానులతో కుమ్మకై ఇప్పటి వరకు సొసైటిలోకి మందుల బస్తాలు తీసుకురాలేదని ఆరోపించారు. రై తుల అభివృద్ధికి పాటుపడాల్సిన డైరెక్టర్లు సొంతంగా లాభ పద్దారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్స్ పాలకవర్గ సభ్యులు వెంటనే రైతులకు ఎరువు బస్తాలు అందుబాటులోకి తీసుకురావాలని లేదా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.

## శభాష్ సెస్ సిబ్బంది

ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ అర్బన్ మండలంలోని సంక పెల్లి, ఆరేపల్లి గ్రామంలోని వ్యవసాయ పొలంలోకి వెళ్లే విద్యుత్ వైర్లు మిడ్ మానేరు బ్యాక్ వాటర్ లో ఉండడంతో శుక్రవారం రోజు వైరు తెగి ద్యాములు పడడం వలన విద్యుత్ అంతరాయం జరిగింది. దీన్ని గమనించిన సెస్ సిబ్బంది బ్యాక్ వాటర్ లోకి తెప్పలపై వెళ్లి వైర్లను సరి చేసి విద్యుత్తు పునర్దించడం జరిగింది. దీని పట్ల సంక పెల్లి, ఆరేపల్లి గ్రామ రైతులు సెస్ సిబంది కి కృతజ్ఞతలు తెలపారు.

## ఐదేళ్ల పాటు సన్న వడ్లకు బోనస్

ప్రజాపక్షం/నిజాంసాగర్: కాంగ్రెస్ పాలన లో తెలంగాణలో రానున్న 5 సం.రాల పాటు సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం జరుగుతుందని మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి అన్నారు. ఆయన నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు దేశ చరిత్రలోనే గొప్ప స్థానం ఉందని, వందేండ్లు ప్రాజెక్టు చెక్కు చెదరలేదని, ఆనాటి నిజాం ప రభుత్వం పనితీరుకు ఈ ప్రాజెక్టు అద్దం పడుతుందని మంత్రి పేర్కొన్నారు. గత 10 సం.ల పాలనలో ఇరిగేషన్ శాఖలో చాలా నష్టం వాటిల్లిందని, ఏకంగా రూ 181 లక్షల కోట్లు నష్టం చేశారని మండిపడ్డారు. పాలమూరు, రంగారెడ్డికి 27 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఒక ఎకరం భూమి సైతం పండలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో రైతుల సంక్షేమం కొరకు తక్కువ నిధులతో సాగు నీరు అభినందించేందుకు కృషిచేస్తున్నామని వారు పేర్కొన్నారు.

## గాంధీ ఆశయ సాధన దిశగా కృషి చేయాలి..

ప్రజాపక్షం/బాన్సువాడ: బాన్సువాడ మండలంలో కోనాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని శుక్రవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, మాజీ సర్పంచ్‌లు వెంకట రమణారావు దేశ్‌ముఖ్, గాండ్ల బాగయ్య, బోనాల సుభాష్, నాయకులు మాసాని శ్రీనివాస్ రెడ్డి, పాత బాలకృష్ణ, గాండ్ల సాయిలు, నాయకులు వెంకాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, సంజీవులు, లక్ష్మణ్‌సింగ్, వెంకట్, గంగారాం, రాజన్న, అబ్బు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టీలలో వర్క్ సైట్ స్కూల్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ఇటుక బట్టీల్లో పని చేసే వలస కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా వర్క్ సైట్ స్కూల్ పేరుతో పాఠశాలలు ప్రారంభించినట్లు రామగుండము పోలీస్ కమీషనర్ శ్రీ ఎం.శ్రీనివాస్, ఐపిఎస్., ఐజి పేర్కొన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ బసంత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రాఘవపూర్ గ్రామంలో బాలకార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ నిర్మూలన, కార్మికుల పిల్లలకు తప్పని సరిగా విద్య పోలీస్ ప్రధాన ధ్యేయంగా ఇటుక బట్టీలలో పలక బలపం పట్టవల్సిన చిట్టి చేతులు ఇటుక బట్టీలలో తల్లితండ్రులతో కలిసి ఇటుకలను చేస్తూ, మోస్తున్న కార్మికుల పిల్లల పరిస్థితి తెలిసి ఇటుక బట్టి యజమానులతో మాట్లాడి కార్మికుల బాగోవులు చూడడంతో పాటు వారి పిల్లలను కార్మికులుగా మార్చవద్దని ఖచ్చితంగా వారికి విద్యాభ్యాసం కల్పించాల్సిందేనని ముఖ్య ఉద్దేశ్యం తో ఏర్పాటు చేసిన వర్క్ సైట్ స్కూల్ క్లాస్ రూములను పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులతో కలిసి ప్రారంభించారు. పిల్లల భవిష్యత్తు కోసం పోలీస్ శాఖ నుండి తమ వంతు సహకారం అందిస్తామని చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని సదుద్దేశంతో ప్రైవేటు పాఠశాలల మాదిరిగా ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి చేతన ఐపిఎస్., పెద్దపెల్లి ఏసిపి జి కృష్ణ, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, బసంత్ నగర్ ఎస్సై స్వామి,తదితరులు పాల్గొన్నారు.

# అడ్రియాల లాంగ్ వాల్ గనిలో 55వ వార్షిక భద్రతా పక్షోత్సవాలు



ప్రజాపక్షం/రామగిరి : సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఈనెల 9 నుండి 21 వరకు నిర్వహిస్తున్న 55వ వార్షిక భద్రతా పక్షోత్సవాలను పురస్కరించుకొని అడ్రియాల లాంగ్ వాల్ గనిలో భద్రతా తనిఖీ బృందం కన్వీనర్ ఎస్.డి.హబీబ్ హుస్సేన్, సభ్యులు, కార్పొరేట్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ శుక్రవారం పర్యటించారు.వారికి ముందుగా అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.తదుపరి ఏర్పాటు చేసినటువంటి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గనికి సంబంధించిన టువంటి పని ప్రదేశాలను, గని యొక్క ఉత్పత్తి వివరాలను తనిఖీ బృందానికి వివరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తనిఖీ బృందం కన్వీనర్ ఎస్.డి.హబీబ్ హుస్సేన్ మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ గని సింగరేణి సంస్థలో ఉన్న భూగర్భ గనుల్లోకెల్లా అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న గని అని అన్నారు. భూగర్భ గనుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు భద్రతపై ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని, అనుక్షణం అప్రమత్తతో ఉంటూ భద్రతతో విధులు నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తూ సింగరేణి సంస్థను ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలని అన్నారు. తదుపరి గత ఏడాది వార్షిక పక్షోత్సవాల్లో సాధించిన బహుమతులను అందజేసి అభినందించారు. అదేవిధంగా ఈ వార్షిక భద్రతా పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ ట్రేడ్ టెస్టులలో విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం భద్రత పట్ల ఉద్యోగులకు మరింత అవగాహన కల్పించడం కోసం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తనిఖీ బృందాన్ని, ఉద్యోగులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తదనంతరం భూగర్భ గని లోకి వెళ్లి పని స్థలాలలో చేపడుతున్న భద్రతా చర్యలను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ కె.హెచ్.ఎన్.గుప్తా, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ కొలిపాక నాగేశ్వరరావు, ఎస్వోటుజియం బండి సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ప్రాజెక్ట్ ఇంజినీర్ రఘురాం, మేనేజర్ కె.జనార్దన్, సేఫ్టీ ఆఫీసర్ రమేష్, వార్షిక భద్రత కమిటి సభ్యులు యం.కనకయ్య, బి.చంద్రశేఖర్, బి.దేశాయ్, యం.డి.రహిమత్ అలి, కె.అమర్ నాథ్, టి.సత్యనారాయణ, కె.పద్మ, వి.వలధర్, బి.చంద్రమొగిలి, బి.రవీందర్, ఎస్.సాయి చరణ్, పిట్ సెక్రెటరీలు గంగాధర్, కొమురయ్య, సేఫ్టీ కమిటీ సభ్యులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హక్కుల సాధనకు పోరాటాలు



ప్రజాపక్షం/కాసిపేట : దేశ వ్యాప్తంగా నిర్మాణ ప్రతిష్టను పెంపొందించుకోవడానికి 2025 జనవరి 5,6,7 తేదీలలో హైదరాబాద్ నగరంలో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడిఆర్ఎం) రెండవ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నిర్మాణ బాధ్యులు దాగం మల్లేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దళిత వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికీ దళితుల దరి చేరడం లేదని అన్నారు. తరతరాలు అణిచివేత, అంటరానితనం, వివక్ష దోపిడీ పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన దళితుల అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా దళిత సామాజిక న్యాయం కోసం విద్య వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, దళితుల వాటా కోసం సమర శంఖం పూరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు డిఆర్ శ్రీధర్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నక్క వెంకటస్వామి, మార పెల్లి రవి, జాడి పోశం, బొంతల లక్ష్మీ నారాయణ, పులి శంకర్, దాగం రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాపక్షం/నస్పూర్ : జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల 22, 24 వార్డులలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం నీడ కల్పించాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని, ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వివరాలను ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినూత్న కార్యక్రమానికి లైన్స్ క్లబ్ శ్రీకారం

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పల్లె దంత సేవా అనే పేరుతో వినుత్న కార్యక్రమాని కి శ్రీకరం చుట్టారు సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్. నిరుపేదలకు ఉచిత దంత వైద్య సేవలు అందించాలని సంకల్పంతో పల్లె దంతసేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాటే టి సంజీవ్ కుమార్ పిలుపునిచ్చారు.సుల్తానాబాద్ లయన్స్ క్లబ్,తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15వ తేదీ ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు ఉచిత పల్లె దంత సేవా కార్యక్రమంలో భాగంగా దంత వైద్యంతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఉచిత దంత వైద్య శిబిరానికి సుల్తానాబాద్ మండల పరిసర ప్రాంత ప్రజలు తమ దంత సమస్యల చికిత్సతో పాటు దంతాల రక్షణ కొరకు అవగాహన పొందాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు,టీడీఎస్ఏ అద్యక్షులు బాలుసాని మణిదీప్ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మహిళలు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎపియం మల్లేషం, సమైక్య అధ్యక్షురాలు బైరి జ్యోతి అన్నారు.శుక్రవారం కావేరి సమైక్య సంఘం వద్ద సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బ్యాంక్ లింకేజి,స్త్రీనిధి ఋణాల ద్వారా ఆదాయాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి అనే అంశంపై మాట్లాడుకున్నారు.మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామి పథకం ద్వారా చేసే అభివృద్ధి పనులను ఏపివో కొమురయ్య వివరించారు,ఉపాధి హామి పనులు,పండ్లతోటల పెంపకం,గేదెల షెడ్లు,గొర్రెలు,కోళ్ళు,లాండ్ లెవల్ పనులు చేపట్టవచ్చని తెలిపారు.ఇట్టి పనులు చేసుకునే వారికి చిన్న,సన్నకారు,సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు.ప్రతి విషయంపై అన్ని మహిళా గ్రూప్ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం జెండర్ ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో సీసీ,ఎంఎ స్ఏలు,అన్ని గ్రామల అధ్యక్షులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు మాట ఇచ్చిన ప్రభుత్వ విప్

ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దళిత సంఘాలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు వేములవాడ అంబేద్కర్ విగ్రహ డెవలప్మెంట్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడ లో సమావేశం నిర్వహించి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. పట్టణంలో గత మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణలో భాగంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అంబేద్కర్ విగ్రహ డెవలప్మెంట్ జేఏసీ విజ్ఞప్తి మేరకు అంబేద్కర్ చౌరస్తాలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చినందుకు విగ్రహ డెవలప్మెంట్ జేఏసీ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జింక శ్రీధర్, గుండా థామస్,తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు నల్లపు అవినాష్, బదుగు సాగర్, కుదిరె సాగర్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. శుక్రవారం పాలకుర్తి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు, భాజపా రామగుండం నియోజకవర్గం ఇన్‌ఛార్జి, తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం మహిళా నాయకురాలు కందుల సంధ్యారాణి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. పెరిక కుల సంక్షేమ సేవా సమితి సభ్యులు అందజేసిన రూ.51,000, గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పోతరాజుల రాధాకిషన్ ఇచ్చిన రూ.10,000లను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కందుల పోచం, బోడకుంట సత్తయ్య, బియ్యాల విఠల్, బోడకుంట తిరుపతి, గోపు రామయ్య, పత్తిపాక సుధాకర్, బి.జెలెందర్, మల్లయ్య, హరీష్, అంజి, కోదూరి శంకరయ్య, తిరుపతి, అందుగుల మల్లేష్, బొద్దు మొగిలి, నలిమెల తిరుపతిలు పాల్గొన్నారు.

## బసంత్‌నగర్ హైవేపై రోడ్డు ప్రమాదం




ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ బస్టాప్ సమీపంలోని రాజీవ్ రహదారిపై శుక్రవారం కల్వర్టుకు కారు ఢీకొన్న ఘటనలో గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన లక్ష్మీరాజ్యం, అతడి భార్య అనసూయ, కుమారుడు సతీష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ లక్ష్మీరాజ్యం మరణించాడు. అనసూయ, సతీష్‌లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లక్ష్మీరాజ్యం భార్య, కుమారుడితో కలిసి హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు వేగంగా ఎడమ వైపున కల్వర్టును ఢీకొనడంతో ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. బసంత్‌నగర్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

## ఎన్టీపీసీలో రాజ్య- భాష హిందీపై శిక్షణ

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం తెలంగాణ ఎన్టీపీసీలోని ఈడీసీ మిలినీయం హాల్‌లో 5 రోజులపాటు హిందీ అనువాద కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరోచే చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ డైరక్టర్(ఆర్ అండ్‌టీ) కేదార్ రంజన్‌పాండు, హెచ్‌ఆర్ హెడ్ బిజోయ్‌కుమార్ సిక్దార్‌లు ఈనెల 9న ప్రారంభించగా శుక్రవారం ముగింపు కార్యక్రమం చేపట్టారు. అందరిలో అంతరాలను తొలగించి కమ్యూనికేషన్‌ను పెంపొందించే ఏకీకృత భాషగా హిందీ ప్రాముఖ్యత గురించి వివరించారు. అధికారిక కమ్యూనికేషన్‌లో హిందీ రాజ్ భాష వినియోగాన్ని ప్రోత్సహించడం, అనువాద నైపుణ్యాలను మెరుగుపరచాలనే ప్రాథమిక లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి జీఎం(ఒఅండ్‌ఎం) ఎకె.త్రిపాఠి ధృవీకరణ పత్రాలు అందజేశారు. అసిస్టెంటు డైరక్టర్‌లు లేఖా సరిన్, జాన్వారియస్ తిర్కి, డీజీఎం(హెచ్‌ఆర్) ప్రవీణ్ కె.చౌదరి, ఆదేశ్‌కుమార్ పాండే, ఎజీఎం అతర్‌సింగ్ గౌతమ్‌లు పాల్గొన్నారు.

## జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైదానంలో ఈనెల 14 శనివారం నాడు కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుజ్జుల కరుణాకర్ రెడ్డి తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు వర్జినల్ ఆధార్ కార్డుతో హాజరుకావాలని బాలురు 70 కేజీల బరువు, బాలికలు 65 కేజీల బరువు ఉండాలని అన్నారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ చివరి వారంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని అన్నారు.

## మోసం చేసిన మంత్రిపై చీటింగ్ కేసు పెట్టాలే...




ప్రజాపక్షం/మంథని: మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా గ్యారెంటీ పథకాలకు రూపకల్పన చేసి ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై చీటింగ్ కేసు నమోదుచేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక పథకం అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా ముత్తారం మండల కేంద్రంలో మహిళలు బెల్ట్‌షాప్‌లు తొలగించాలని కోరితే ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల అభ్యర్థనకు అనుగుణంగా బెల్టు షాప్‌లను లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ముత్తారం ఆడబిడ్డలకు ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసిన క్రమంలో మంత్రిని ఓ మీడియా ప్రతినిది అడిగిన ప్రశ్నకు ఎవడు చెప్పాడంటూ సమాధానం ఇచ్చాడని అన్నారు. చదువుకున్న వ్యక్తిగా అలా మాట్లాడటం సంస్కారమేనా అని ఆయన అన్నారు. మంథనికి చెందిన ఎమ్మెల్యే సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తి చదువుకోని వ్యక్తి నాయకుడైతే పదేళ్ల అభివృద్ధిలో వెనుకబడిపోయిందని మాట్లాడాడని, మరి చదువుకున్న వ్యక్తి నాయకుడిగా ఏం సంస్కారం ఉందని ఆలోచన చేయాలని హితవుపలికారు. తాము ప్రభుత్వ వైఫల్యాలను, పనితీరును ప్రశ్నిస్తే కిందిస్థాయి నాయకులతో దూషించడం అలవాటుగా మారిపోయిందన్నారు. 40ఏండ్లు మంథని ప్రజలు అధికారం కల్పిస్తే ఏం అభివృద్ధి చేశారో, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో పదేళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలు అమలు చేయకుండా మోసం చేసిన మానీఫెస్టో చైర్మన్ మంథని ఎమ్మెల్యేపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పోలీసులకు రిజిష్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేయడం జరుగుతుందని, ఫిర్యాదుపై పోలీసులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు శంకర్ గౌడ్, నాయకులు రాజుగౌడ్, కనవేన శ్రీనివాస్, వేల్పుల గట్టయ్య, పెగడ శ్రీనివాస్, సుల్తాన్ ఆసిఫ్‌ఖాన్, ఇర్ఫాన్, కాయితి సమ్మయ్య, కాపురబోయిన బాస్కర్, కుమార్‌తో పాటు స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ




ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నట్టు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారంసుల్తానాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీ చింతకుంట విజయ రమణారావు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రాన్ని గత కెసి ఆర్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టివేసిందని అన్నారు. ఒకవైపు వారు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ రంగాల్లో దూసుకు వెళ్తోందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. ఇందులో ఎలాంటి సంశయం అక్కరలేదని విజ్ఞప్తి చేశారు. కావాలని ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని వివరించారు. ఎన్నడూ లేని విధంగా సుల్తానాబాద్ అభివృద్ధిని చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. రానున్న రెండు సంవత్సరాల్లో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. అలాగే రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో నిర్మాణాలు చేస్తున్నామని అన్నారు. సుల్తానాబాద్ చెరువును మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేసేందుకు రూ.12.50 కోట్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల నుండి 50 పడకలకు అప్ గ్రేడ్ చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ విద్యాలయాన్ని నెలకొల్పనున్నట్టు తెలిపారు. ఎలిగేడు మండలం ర్యాకల్ పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున అక్కడ 25 ఎకరాల్లో రూ. 130 కోట్లతో ఇట్టి విద్యాలయం ను నిర్మించనున్నట్టు చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమతా కృష్ణ, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వయస్సుకు అడ్డురాని బైపాస్ సర్జరీ



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్‌లో ఓ 84 వయస్సు గల వృద్దురాలికి బైపాస్ సర్జరీ విజయంతంగా నిర్వహించి అరుదైన వైద్య చరిత్ర సృష్టించినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు మంగళవారం అపోలో రీచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో మాట్లాడుతూ ప్రముఖ కార్డియాక్ సర్జన్ డా. సంతోష్‌కుమార్,అనస్థీషియా నిపుణుడు డా.దామోదర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన 84 సంవత్సరాల భూమక్కకు బైపాస్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఇది అపోలో రీచ్ హాస్పిటల్‌లో నిర్వహించిన తొలి బైపాస్ సర్జరీగా నిలిచిందన్నారు. 80 సంవత్సరాల దాటిన వయసు వారికి బైపాస్ సర్జరీ రిస్క్‌గా మారుతుందని, వారికి వెంటిలేటర్ అవసరంతో పాటు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. కానీ భూమక్క యాక్టివ్‌గా ఆరోగ్యంగా ఉండడమే ఈ విజయానికి కారణమన్నారు. భూమక్క యాక్టివ్‌గా ఉండడంతో ఆమె కుటుంబ సభ్యులు సర్జరీ చేయాలని నిర్ణయించుకున్నారని, ఆరోగ్య శ్రీ ద్వారా ఈ సర్జరీ పూర్తిగా ఉచితంగా నిర్వహించబడిందని పేర్కొన్నారు. వయ సు పైబడిన వారికి ఎంఐసిఎస్ (మినిమిల్లీ ఇన్వాసిస్ కార్డియాక్ సర్జరీ) వంటి సాంకేతికతలు వృద్దులకు కొత్త ఆశలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్న కోత ద్వారా సర్జరీ చేస్తామన్నారు. తక్కువ నొప్పి, తక్కువ సమయం పడుతుందన్నారు. ఎముకల్ కట్, ఇన్ఫెక్షన్, రక్తస్రావం ఉండదన్నారు. దీంతో వేగవంతంగా పేషెంట్ రికవరీ అవుతారని పేర్కొన్నారు. అనంతరం భూమక్క మనవడు పవన్ కుమార్ మాట్లాడుతూ తమ నానమ్మకు పునర్జన్మనిచ్చిన డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. హాస్పిటల్ పరిపాలకుడు డా.నాగ సతీష్ మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి ప్రధాన పట్టణాలకే పరిమితమైన, దేశవ్యాప్తంగా అతికొద్ది మంది మాత్రమే నిర్వహించగలిగిన మిక్స్ టెక్నిక్ ద్వారా కరీంనగర్ లాంటి రెండవ తరగతి పట్టణాల్లోనూ అపోలో రీచ్ హాస్పిటల్ వారు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

## స్టేడియంలో బ్యాడ్మింటర్ కోర్టు లీజు ఆలోచన విరమించుకోవాలి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ నగరంలోని అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టును ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు లీజు ఆలోచనను విరమించుకోవాలని డివైఎస్‌వోకు వినతి పత్రం సమర్పించారు. అంబేద్కర్ స్టేడియం ప్రభుత్వ ఆస్తి అని, ఇందులో ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి హక్కు లేదన్నారు. ఇలాంటి దాంట్లో ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా పోరాటాలు తప్పవని ఆయన హెచ్చరించారు. పేద, మధ్య తరగతి కుటుంబాల క్రీడాకారులు ఆడుకోవడం కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బ్యాడ్మింటర్ కోర్టును ఏర్పాటు చేసిందని, లక్ష రూపాయలతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తే ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఇది లీజుకు ఇస్తే డబ్బులు పెట్టి ఆడాల్సిన దుస్థితి ఉంటుందని, పేద క్రీడాకారులు ఆడలేని పరిస్థితి ఉంటుంది కాబట్టి, వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో క్రీడాకారులను ఐక్యపరిచి ఉద్యమాలు చేస్తామని యుగంధర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

## బదిలీ యత్నాలను వ్యతిరేకిస్తూ విధుల బహిష్కరణ



ప్రజాపక్షం/గోదావరిఖని : సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల చిన్న చిన్న తప్పిదాలను చూపుతూ జోన్‌కు నలుగురు చొప్పున బదిలీ చేయాలని యాజమాన్యం ప్రయత్నాలు చేయడంతో, దీనిని వ్యతిరేకిస్తూ ఆర్జీ1 జీఎం కార్యాలయం ఎదుట డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు విధులు బహిష్కరించి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో అధికారులు కార్మికులను వేధింపులకు గురిచేయవద్దని, అధికారుల వేధింపుల విషయాన్ని జీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు కార్మిక సంఘాల నాయకులు రియాజ్ అహ్మద్(హెచ్‌ఎంఎస్), రాజిరెడ్డి(సీఐటీయూ), ఎ.వెంకన్న, ఈ.నరేష్, బి.అశోక్(ఇఫ్టూ)లు తెలిపారు. ఈ విషయమై కార్మిక సంఘాల నాయకులతో జీఎం డి.లలిత్‌కుమార్ చర్చలు జరిపి బదిలీల యత్నాలను నిలిపివేశారు. భవిష్యత్తులో ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వహించాలని, పని స్థలాల్లో ఏమైన ఇబ్బందులుంటే యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, తోట వేణు, ఉపేందర్‌లు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సౌకర్యం కోసం ర్యాంపులు నిర్మించాలి..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాలకు రావడానికి నిర్మల్ జిల్లా కేంద్రంలో కొన్ని చోట్ల ర్యాంపులు లేవని శుక్రవారం సివిల్ జడ్జ్ రాధిక కు వినతి పత్రం అందజేశారు.అలాగే 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం ఈ సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ మేరకు అమె సానుకూలంగా స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి చేపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇసాక్ అలీ,ఫసిఉద్దీన్ ఉన్నారు.

## యువత బాగుంటే.. దేశం బాగు



ప్రజాపక్షం/రామగుండం : సమాజంలో యువత చెడుదారిలో పయనించకుండా సన్మార్గంలో నడిచేలా, సామాజిక మార్పు తెచ్చేలా సందేశాత్మకమైన లఘు చిత్రాలను రూపొందించాలని రామగుండం ఎస్.ఐ. సంధ్యారాణి అన్నారు. శుక్రవారం రామగుండం పట్టణంలో పల్లవి చరణం మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సదా మీ సేవలో లఘు చిత్రం షూటింగ్‌ను క్లాప్ కొట్టి ఎస్.ఐ. ప్రారంభించారు. చిత్రం డైరక్టర్ మోదుంపల్లి రామస్వామి, నటులు ఆరుముళ్ల భూమయ్య, కంది నాగరాజులు పాల్గొన్నారు.